# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అచ్యుతాపురం ఫార్మా సంస్థ ప్రమాద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అన్నారు.**
3. **భూ సమస్యల్ని పరిష్కరించడానికి వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**
4. **రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల రెండో విడత కౌన్సెలింగ్ ఈరోజు నుంచి ప్రారంభమైందని ఉన్నత విద్యాశాఖ వెల్లడించింది.**
5. **దేశ వ్యాప్తంగా రేపు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024ను జరుపుకుంటారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో పర్యటిస్తున్నారు. జిల్లాలోని రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా పారిశ్రామిక వాడలో నిన్న జరిగిన ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 17కి చేరింది. ఎసెన్షియా సంస్థలో రియాక్టర్ పేలుడుతో ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలతో పాటు గాయపడి విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి పరామర్శించి వైద్య బృందాలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఫార్మా ప్రమాద ఘటన బాధాకరమని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా. హెలికాప్టర్‌లో అచ్చుతాపురం పారిశ్రామిక వాడకి చేరుకుని ప్రమాద స్థలాన్ని ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు.

-------------------------

అచ్యుతాపురం ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయలు పరిహారం ప్రకటించినట్లు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. కెజిహెచ్‌లో బాధిత కుటుంబాలను జిల్లా కలెక్టర్ ఈరోజు పరామర్శించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ 12 మృతదేహాలు కేజీహెచ్‌కు వచ్చాయని, పోస్టు మార్టం పూర్తి చేసి సంబంధిత మృతదేహాలను కుటుంబ

సభ్యులకు అప్పగిస్తామని కలెక్టర్ తెలుపుతూ..

వాయిస్ ...28 సెకన్లు....

---------------------------

పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఒకేరోజు 13 వేల 326 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మలిదశ సంస్కరణలు చేపట్టామని, పంచాయతీల్లో ఆగస్టు 15, జనవరి 26న ఉత్సవాల నిర్వహణకు నిధులు పెంచినట్లు వివరించారు. గ్రామసభల్లో యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేలా చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ తెలిపారు.

---------------------------

దేశ వ్యాప్తంగా రేపు మొట్టమొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024ను జరుపుకుంటారు. చంద్రమండలాన్ని తాకుతూ జీవితాలను స్పృశించడం... భారత అంతరిక్ష గాథ అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని భారత మండపంలో జరిగే కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రారంభించనున్నారు. గత సంవత్సరం ఆగష్టు 23న చంద్రయాన్– 3 యాత్ర విజయవంతంగా ముగించి, విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సురక్షితంగా దిగింది. దీంతో భారత్ చంద్రునిపై కాలు మోపిన నాల్గవ దేశంగా, దక్షిణ ధృవం చేరిన తొలి దేశంగా ఘనత సాధించింది. ఈ నేపథ్యంలో రేపు దేశ వ్యాప్తంగా పలు అంతరిక్ష అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

---------------------------

గ్రూప్ 1 మెయిన్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్– ఏపీపీఎస్సీ ప్రకటించింది. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 2 నుండి 9వరకు పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే అభ్యర్థుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పరీక్షలు వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహించే తేదీలు తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. మొత్తం 81 గ్రూపు 1 పోస్టుల భర్తీకి గానూ మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా అందులో 4 వేల 496 మంది మెయిన్స్ కు అర్హత సాధించారు.

---------------------------

రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల రెండో విడత కౌన్సెలింగ్ ఈరోజు నుంచి ప్రారంభమైందని ఉన్నత విద్యాశాఖ వెల్లడించింది. ఈ రోజు నుంచి 24 వరకు కౌన్సెలింగ్‌కు నమోదు చేసుకోవాలని పేర్కొంది. సహాయ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన, కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు ఈ నెల 25వ తేది వరకు అవకాశం కల్పించినట్లు తెలిపింది. 26న వెబ్ ఐచ్ఛికాలు మార్పు, 29న ప్రవేశాల కేటాయింపు ఉంటుందని, అభ్యర్థులు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 3 లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

---------------------------

డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ స్మృతివనం నిర్వహణ బాధ్యతల్ని విజయవాడ నగర పాలక సంస్థ నిర్వహించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి. శ్రీబాలవీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. స్మృతివనం ప్రాజెక్టుపై సచివాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రితో చర్చించి అపరిష్కృత పనుల్ని పూర్తి చేస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలోని దేవాలయాలకు త్వరలో నూతన పాలకమండళ్ళను నియమిస్తున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని ఈరోజు ఉదయం మంత్రి దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను గుర్తించామని వాటికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుల పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (17 సెకన్లు)

---------------------------

భూ సమస్యలు, ఆన్‌లైన్‌లో రికార్డుల మార్పు సహా వివిధ సమస్యల్ని పరిష్కరించడానికి వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళగిరిలో నిన్న మంత్రి మాట్లాడుతూ, అన్ని రకాల భూ వివాదాలపైనే కాకుండా.. రీ సర్వే ద్వారా రైతులకు ఎదురైన సమస్యలపై కూడా సదస్సుల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. సదస్సులు ప్రారంభమైన తొలి 45 రోజులు ఫిర్యాదులు స్వీకరించి, మరో 45 రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి జరిగే ప్రతి గ్రామసభకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. గ్రామసభలు, ఉచిత ఇసుక విధానం అమలుపై రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధి గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఉచిత ఇసుకకు సంబంధించి వచ్చే నెల 11వ తేదీ నుంచి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండాచర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక కోసం బుకింగ్ చేసిన వాహనాలకు ఏ తేదీన ఏ సమయంలో ఇసుకను తీసుకెళ్లాలనేది స్పష్టంగా కేటాయించాలని తెలిపారు.

---------------------------

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ కూలీలు లబ్ధి పొందుతున్నారని చిత్తూరు పార్లమెంటు సభ్యులు డి. ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులో ఈరోజు ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం అమలుపై గ్రామ సభలు నిర్వహించనున్నామని చెప్పారు. రేపు చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన అన్ని గ్రామాల్లోనూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామసభల్లో అధికారుల దృష్టికి

తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించే సభలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వానపల్లికి కిలోమీటరు దూరంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి ప్రారంభమయ్యే గ్రామసభలో ముఖ్యమంత్రి పాల్గొని ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనుల గురించి స్థానికులతో చర్చించనున్నారని చెప్పారు.

---------------------------

మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని కాపాడవచ్చని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఇ.కరుణశ్రీ తెలిపారు. నిన్న పశ్చిమ గోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏక్ పేడ్ మా కె నామ్ అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రైతులకు నిమ్మ, చెర్రీ, వాక్కాయ మొక్కలను అందజేశారు. అనంతరం కరుణశ్రీ మాట్లాడుతూ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆదేశాల మేరకు అమ్మపేరు మీద ఒక మొక్క కార్యక్రమం నిర్వహించామన్నారు. మొక్కలు నాటడం వల్ల నేల కోతను నివారించవచ్చన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యాలయాల్లో 1,380 మొక్కలు విద్యార్థులు నాటి, వాటిని సంరక్షిస్తున్నారని తెలిపారు.

======================